
150 YEARS OF CELEBRATING THE MAHATMA

జాతి పిత గాంధి



ఈదర
గోపీచంద్

గాంధీస్మారక సమితి

మహాత్మా "గాంధీ-150" వ జయంతి సం॥ర విశేష ప్రచురణ

జాతి పిత గాంధి

సంపాదకులు : **ఈదర గోపీచంద్**

మూలరచన: ఎస్.ఏ. రహీం చిత్రాలు: రజాక్, మద్రాసు

అనువాదము : కోదాటి యుగంధర్

ప్రథమ ప్రచురణ (1969) కర్త :

కీ॥శే॥ కోదాటి నారాయణరావు

వ్యవస్థాపక కార్యదర్శి

ఆం.ప్ర. గాంధీ స్మారక నిధి, హైదరాబాదు

ద్వితీయ (2001), తృతీయ (2012), చతుర్థ (2018) ప్రచురణ :

ఇక్కుర్రు రోడ్, నరసరావుపేట - 522 601. గుంటూరు జిల్లా. సెల్ : 94403 45494

ప్రతులు : 5000, ఆవిష్కరణ : 02-10-2018, రూ. 20 / -

అక్టోబరు 2వ తేదీ మహాత్మాగాంధీ పుట్టిన రోజు. ఆరోజు జాతీయ సెలవు దినం. దేశమంతటా ఆరోజు ఉత్సవం జరుపుకుంటారు. మనదేశంలోనే కాదు. విశ్వంలోని అన్ని దేశాలప్రజలూ ఆరోజును 'ఐక్యరాజ్యసమితి' పిలుపు ననుసరించి "ప్రపంచ అహింసా దినం"గా పాటిస్తారు! గాంధీగారు ప్రబోధించిన సత్యం, అహింస, సత్యాగ్రహం, సర్వోదయం, స్వావలంబనం, గ్రామస్వరాజ్యం, నిరాడంబరత్వం, జీవకారుణ్యం, మొ॥ విధానాలను గుర్తు చేసుకుంటారు.


గోపాల్ ఇంట్లో గాంధీ పటం వుంది. వారు కూడా వాడుక ప్రకారం ఉత్సవం చేసుకున్నారు. గోపాల్ ఆనాడు బడికి వెళ్లలేదు. అతని తండ్రి కూడా యింట్లోనే వున్నాడు. ఆనాడు అందరికీ సెలవుకదా.

"ఈ రోజు సెలవెందుకు?" అని గోపాల్ తండ్రిని అడిగాడు.


OCTOBER
2


"ఇవాళ (02–10–2018) గాంధీ మహాత్ముని 150 వ పుట్టినరోజు. ఆయన ఒక తండ్రిలా మనలను నడింపిచాడు. ఆయన పుట్టిన రోజును పండుగలా 2 సం॥ల పాటు అనగా 2-10-2020 వరకు జరుపుకోవాలని, భారత ప్రభుత్వం నిర్ణయించింది. ఇదే రోజు (02-10-1904) జన్మించిన మనదేశ 2వ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రిని కూడా మనం స్మరించుకుంటాం" అని గోపాలుని తండ్రి వివరించాడు.

గోపాల్ తండ్రి ఒక అందమైన పుస్తకాన్ని కొన్నాడు. అది గాంధీగారి సచిత్ర జీవిత చరిత్ర. ఆయన ఆ పుస్తకాన్ని గోపాల్‌కు యిచ్చాడు. గోపాల్‌కి ఇలాంటి బొమ్మల కథల పుస్తకాలంటే ఎంతో ఇష్టం. దేశ నాయకుల బొమ్మలను అతడు తరచూ సేకరించి చిత్రప్రదర్శిని (ఆల్బం) లో అంటిస్తుంటాడు. గోపాల్ ఆ పుస్తకాన్ని యిలా చదవటం మొదలు పెట్టాడు.



"బొంబాయికి దగ్గరగా పోర్‌బందరులో గాంధీ మహాత్ముడు పుట్టాడు. మన భారతదేశానికి పడమటి తీరాన గుజరాతు రాష్ట్రంలో పోర్‌బందరు ఒక చిన్న రేవు పట్టణము. 1869 అక్టోబరు 2 న గాంధీ జన్మించారు. చిన్నతనంలో ఆయనను మోహన్ అని, మోనీ అని ముద్దుగా పిలిచేవారు.

గాంధీ తండ్రి కరంచంద్ గాంధీ. ఆయనను కాబాగాంధి అని కూడా అనేవారు. తల్లి పుత్తలీబాయి. మహాత్ముని పూర్తిపేరు 'మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ'. అసలు పేరు తర్వాత తండ్రిపేరు, చివర ఇంటి పేరు ఉండటం అక్కడి సంప్రదాయం. కాబాగాంధి రాజకోట సంస్థానంలో దివాను అంటే మంత్రిగా పనిచేసేవారు.



పుత్తలీబాయికి గాంధీ మూడవ కొడుకు. ఆయన చిన్నతనంలో చూడటానికి అందంగా వుండేవాడు కాదు. ఆయన చెవులూ, ముక్కూ, మూతీ పొడుగ్గా వుండేవి. అతడు బక్క పలుచగా వుండేవాడు. చూడండి, బాలమోహన్‌ని అక్క, అన్న ఎలా ముద్దు చేస్తున్నారో!

తన మూడవ కొడుకు అందంగా లేడని పుత్తలీబాయి తరచుగా విచారపడుతూ వుండేది. అయినా ఆయన ఆమె కొడుకే గదా! తల్లికి తన కొడుకు మీద ప్రేమ తక్కువ వుండదు కదా! చాతుర్మాస్యవ్రతం, చాంద్రాయణ వ్రతం పేరిట తల్లి తరచూ చేసే ఉపవాసాలు, తమ ఇంటికివచ్చే భిన్నమత పెద్దలతో తండ్రి చేసే గోష్ఠులు బాలమోహన్‌ను ప్రభావితం చేసేవి. ఉపవాస దీక్షలు, సర్వమత సామరస్యము అనే గుణాలు ఇలా గాంధీకి తల్లిదండ్రుల నుంచి వచ్చినవే.



మోహన్‌దాస్‌కు అయిదేళ్ళు నిండాయి. పోరుబందరులో ఒక బడిలో చదువుతూ వుండేవాడు. మరో రెండేళ్లకే వారి కుటుంబం రాజకోటకు పోవలసి వచ్చింది.

మోహన్ రాజకోటలోని “ఆల్‌ఫ్రెడ్ హైస్కూల్’’ (మోహన్ మహాత్ముడైనాక ఈ స్కూల్ పేరును ‘‘మోహన్‌దాస్ గాంధీ విద్యాలయ’’గా మార్చడం విశేషం!) లో చేరాడు.

అతడు ఎప్పుడూ కూడ “హోం వర్కు” ఏ రోజుది ఆ రోజే చేసేవాడు. కానీ, ఆయనకు ఎవరితోనూ కలుపుగోలుగా వుండే అలవాటు లేదు. ఎల్లప్పుడూ సిగ్గుతోను ఒంటరిగాను ఉండేవాడు. బడికి తానొక్కడే వెళ్ళేవాడు. బడిగంట కొట్టగానే తిన్నగా ఇంటికి వచ్చేసేవాడు. జబ్బుతో మంచం మీద ఉన్న తండ్రికి సపర్యలు చేసేవాడు. తల్లికి ఇంటి పనుల్లో సహాయ పడేవాడు.



మోహన్‌దాస్‌కు 13 ఏండ్లు నిండాయి. ఆయన అప్పుడొక ఉన్నత పాఠశాలలో చదువుతూ వుండేవాడు. క్లాసుపుస్తకాలేకాదు. తండ్రితెచ్చిన 'శ్రవణకుమారుని పితృభక్తి' పుస్తకాన్ని చదివి, 'సత్యహరిశ్చంద్ర' నాటకం చూచి మోహన్ తల్లిదండ్రులపట్ల భక్తిని, సత్యంపట్ల అనురక్తిని పెంచుకున్నాడు.

కానీ, అతనికి చెడు సహవాసం కూడా అబ్బింది. పొగ త్రాగడం మొదలు పెట్టాడు. చుట్టలు కొనడానికి డబ్బు కావలసి వచ్చేది. ఆయన పినతండ్రి పొగత్రాగేవాడు. ఆయన పారవేసిన చుట్టముక్కలను మోహన్ ఏరుకొని త్రాగేవాడు. అప్పుడప్పుడు ఇంట్లో దొంగిలించి, ఆ డబ్బుతో చుట్టలు కొనేవాడు. మిత్రుల ప్రోద్బలంతో మాంసం కూడా తిన్నాడు. అమ్మ అన్నానికి రమ్మంటే, ఆకలిగా లేదని అబద్ధం ఆడాడు. ఆ రాత్రి పొట్టలో మేక మేఁ మేఁ అని అరుస్తున్నట్లు పీడ కల వచ్చింది. అంతటితో భయపడి మాంసభక్షణ మానేశాడు.



మరొకరోజు అతడు తన స్నేహితుడు చేసిన అప్పు తీర్చడానికి ఇంట్లో చిన్న బంగారపు ముక్కని దొంగతనం చేశాడు. కానీ ఆతర్వాత మనసు కలుక్కుమన్నది. తను చేసినది తప్పని అనిపించింది. ఒంటరిగా కూర్చొని పశ్చాత్తాప పడ్డాడు.

అతడు అంతటితో తృప్తిపడలేదు. చేసినదంతా తన తండ్రికి చెప్పవలెనని అనుకున్నాడు. కాని తండ్రితో చెప్పటానికి ధైర్యం చాలలేదు. అందుకని ఆయన తను చేసిన తప్పును అంగీకరిస్తూ, అందుకు తనను శిక్షించమని కోరుతూ ఉత్తరం రాసి, తండ్రి చేతికిచ్చాడు. ఆ వయస్సులోనే మోహను తన తప్పులను ఒప్పుకునే వివేకం ఉండేది. ఇలా బాలమోహన్ కొన్ని తప్పులు చేసినా, వెంటనే సరిదిద్దుకొని, మంచి మార్గం వైపు వెళ్ళబట్టే పెద్దయ్యాక మహాత్ముడి స్థాయికి ఎదిగాడు.



తను చేసిన తప్పు తండ్రికి ఆగ్రహం కల్గిస్తుందని మోహన్ భావించాడు. కానీ, జాబు చదవగానే బాధపడిన కాబాగాంధీ కనుల నుండి కన్నీటి చుక్కలు జారి జాబుపై పడ్డాయి. ఆ బాష్పాలు తన పాపాన్ని కడిగివేశాయని గాంధీజీ తర్వాత తన ఆత్మకథలో రాశారు. కాబాగాంధీకి ఆ జాబు కోపం కలిగించలేదు. ఆయన తన కుమారుని నిజాయితీని మెచ్చుకున్నాడు. తన కుమారుడు తిరిగి తప్పు చేయడనే విశ్వాసం ఆయనకు కలిగింది.

ఆ రోజుల్లో 'బాల్య వివాహాల' దురాచారం ఉండేది. అందుకే మోహన్‌దాస్‌కు 13 సం॥ల చిన్న వయస్సులోనే పెండ్లి అయింది. ఆయన భార్య పేరు కస్తూరిబాయి. ఆమె గుణవంతురాలైన, ధైర్యశాలి అయిన బాలిక. కానీ ఆమెకు చదువు లేదు. మోహనే కొంత చదువు నేర్పాడు.



పై చదువులకై మోహన్‌దాస్‌ను ఇంగ్లండుకు పంపవలెనని నిశ్చయమయింది. ఆ రోజులలో బారిష్టరు చదువు, అనగా న్యాయశాస్త్రం అభ్యసించాలంటే, ఇంగ్లాండు వెళ్ళవలసి వచ్చేది. అలా పంపడం భారమయినప్పటికీ మోహన్ మీద ప్రేమతో అన్న అందుకు పూనుకున్నాడు. విదేశాలకు వెళ్తే చెడిపోతావని, కులం నుంచి వెలివేస్తామని కుల పెద్దలు హెచ్చరించినా, మోహన్ బెదరలేదు.

ఓడలో వున్నప్పుడు మోహన్‌దాసు నల్లని సూటు ధరించాడు. దిగేటప్పుడు తెల్ల సూటు ధరించాడు. అది ప్రతివారికీ ఆశ్చర్యం కలిగించింది.

ఓడలో వున్నప్పుడు బట్టలు తేలికగా మాయవు. అందుకని అందరూ తెల్లబట్టలు వేసుకుంటారు. మోహన్‌దాసుకి అప్పుడు ఆ సంగతి తెలియదు. అదే మొదటి ఓడ ప్రయాణం కదా మరి!



మోహన్‌దాస్ ఇంగ్లాండులో న్యాయశాస్త్రం అభ్యసిస్తూ వుండేవాడు. అతడు అక్కడి ఆడంబర జీవితపు ఆకర్షణలో పడ్డాడు. అందువల్ల విచ్చలవిడిగా డబ్బు ఖర్చు పెట్టసాగాడు.


ఒకరోజు ఒక దుకాణానికి వెళ్ళాడు. తనకు సరిపోతుందో లేదో చూసుకోకుండానే చాలా విలువైన టోపీ కొన్నాడు. ఆయన తిరిగి వచ్చిన తర్వాత యింట్లో టోపీ పెట్టుకొని చూసుకున్నాడు. ఆయన తలకంటే అది చాలా పెద్దది. ఆయనకు పొడవైన చెవులే లేకుంటే మొహమంతా కప్పివేసేది ఆ టోపీ.

అంతేకాదు, తోటి ఆంగ్లేయ మిత్రుల వలే ఉండాలని కోటు, బూటు, సూటులే గాక ఫిడేలు, నిలువెత్తు అద్దం మొదలైన విలాస వస్తువులు కొన్నాడు. పాశ్చాత్య సంగీతం క్లాసులో చేరాడు.


HATS

ఆయన ఇంగ్లాండ్‌లో 3 సంవత్సరాలు (1888 నుండి 1891 వరకు) చదివాడు. ఆయనకు తన ఖర్చులన్నీ వ్రాసి పెట్టే మంచి అలవాటుండేది. దానినే దినచర్య పుస్తకం (డైరీ) అంటారు. ఒకసారి ఆ లెక్కను చూచి భయపడ్డాడు.

ఆయన ఎందుకు భయపడ్డాడో తెలుసా? తన అన్న కష్టపడి చదువుకై డబ్బు పంపిస్తుంటే, తనేమో విలాసాలకై ఆ డబ్బును దుబారా (జల్సా) చేస్తున్నానని తెలుసుకున్నాడు. తన తప్పును గుర్తించాడు. ఇక అలా అనవసర విషయాలకై డబ్బు ఖర్చు పెట్టరాదని నిశ్చయించుకున్నాడు. పొదుపు పాటించాడు. కళాశాలకు కాలినడకన వెళ్ళసాగాడు. తనే రొట్టెను తయారు చేసుకునేవాడు. చిన్నగదినే అద్దెకు తీసుకున్నాడు. స్నేహితులతో విందులు మానాడు. తీరిక వేళల్లో మంచి పుస్తకాలు చదివాడు. “శాకాహార ప్రచార సంఘం” లో చేరి, కార్యదర్శిగా సేవలందించాడు.




ఆ విధంగా మూడు సంవత్సరాలు ఇంగ్లాండులో వుండి న్యాయశాస్త్రాన్ని పూర్తి చేసి, భారతదేశానికి తిరిగి వచ్చాడు. మోహన్‌దాస్‌కు స్వాగత మివ్వటానికి ఆయన అన్న లక్ష్మీదాస్ గాంధీ బొంబాయి వచ్చాడు. ఓడ దిగగానే తన తమ్ముని ప్రేమతో కౌగిలించుకున్నాడు. మాటలలో తల్లి మరణవార్తను అన్న చెప్పగా విని చాలా దుఃఖించాడు.

“మద్యం, మాంసం, పరస్త్రీల”ను ముట్టనని తల్లి ఎదుట 3 ప్రతిజ్ఞలు చేసి, ఆశీస్సులు పొంది, ఇంగ్లండు వెళ్ళిన మోహన్, ఆ ప్రతిన నిలబెట్టుకుని 3 సం॥ల వియోగం తర్వాత మరల తిరిగివస్తూ, తల్లిని చూడబోతున్నానని ఆనందపడ్డాడు. కాని ఆ కల చెదిరిపోయింది. ఎక్కడ తన చదువుకు భంగం కల్గుతుందోనని అమ్మ మరణ వార్తను అన్న తనకు తెల్పలేదట!



మోహన్‌దాస్ రాజకోటలో, బొంబాయిలో ప్రాక్టీసు పెట్టాడు కానీ, న్యాయవాదిగా ఆయన రాణించలేదు. ఒక వ్యాపార సంస్థ తమ కేసులో వ్యవహరించడానికి ఆయనను దక్షిణాఫ్రికాకు రమ్మంది. దక్షిణాఫ్రికా కూడా ఆంగ్లేయుల పాలనలో వుండేది. 1893లో ఆయన ఓడలో దక్షిణాఫ్రికా వెళ్లాడు.

ఆయన గుజరాతీ సాంప్రదాయమైన తలపాగాతో 'డర్బాన్'లోని న్యాయస్థానానికి హాజరైనాడు. న్యాయాధిపతి తలపాగా తీసివేయమన్నాడు. కానీ, తలపాగా తీసేయడం తన ఆత్మగౌరవానికి భంగం అనుకున్నాడు. అందుకని దానిని తీసివేయటానికి ఒప్పుకోలేదు. న్యాయస్థానాన్ని కూడ వదలివేసి బయటికి వచ్చాడు. ప్రతికలకు ఫిర్యాదు చేశాడు. అంతటి ఆత్మాభిమానం ఆయనకుండేది. కనుకనే ఆయన ఎన్నో ఉద్యమాలు చేయగల్గాడు.



ఒకనాటి రాత్రి మోహన్‌దాస్ నేటాల్ నుండి ప్రిటోరియా వెళ్ళే రైలులో ప్రయాణిస్తూ 'మారిట్సుబర్గ్' అనే స్టేషన్‌కు చేరాడు. అంగ్లేయుడొకడు అదే పెట్టెలో ఎక్కాడు. అతను మోహన్‌దాస్‌ను వేరే పెట్టెలోకి వెళ్ళి కూర్చోమన్నాడు. మోహన్‌దాస్ తనవద్ద కూడా మొదటి తరగతి టిక్కెట్టే వున్నదని సమాధానమిచ్చాడు. ఆ ఆంగ్లేయుడు ఆగ్రహించాడు. కాని మోహన్‌దాస్ దిగటానికి నిరాకరించాడు. అంతట ఆ ఆంగ్లేయుడు పోలీసులను పిలిపించాడు. పోలీసులు కోపంతో అతనిని పెట్టె నుండి క్రిందికి తోసివేశారు. ఇలా తెల్లవారు నల్లవారి పట్ల 'వర్ణ వివక్ష' పాటించేవారు, అవమానాలకు గురి చేసేవారు.

రైలు కదలిపోయింది. మరోచోట గుర్రపుబండిలో ప్రయాణం చేస్తుంటే, ఇలాంటి అవమానమే ఎదురయింది. అయినా, గాంధీ దౌర్జన్యానికి దిగలేదు. నిబ్బరంగా భరించాడు. శాంతంగా తన హక్కులకై నిలబడ్డాడు, నిర్భయంగా ఎదుర్కొన్నాడు. పై అధికారులకు ఫిర్యాదు చేశాడు.


I CLASS

మోహన్‌దాస్ గాంధీ దక్షిణాఫ్రికాలో భారతీయులకు జరుగుతున్న అగౌరవానికి చాలా బాధపడ్డాడు. దానికి కారణం భారతదేశం బానిసత్వంలో ఉండటమేనని గుర్తించాడు. దక్షిణాఫ్రికాలోని భారతీయులను ఏకం చేశాడు. "నేటాల్ ఇండియన్ కాంగ్రెస్" అనే సంస్థను స్థాపించాడు. "సత్యాగ్రహాలు" అనే నూతన అహింసాయుత పోరాటాలు చేశాడు. జైలుకు వెళ్ళాడు. విజయాలు సాధించాడు. 'సత్యాగ్రహం' అంటే "సత్యం పట్ల పట్టుదల చూపడం".

1915లో దక్షిణాఫ్రికా నుండి భారతదేశానికి తిరిగి వచ్చాడు. రాగానే తిలక్, గోఖలే, నౌరోజి మొదలగు అగ్రనాయకులను గాంధీ కలిశాడు. తన రాజకీయ గురువు గోఖలే సూచన మేరకు ఏడాదిపాటు దేశమంతటా 3వ తరగతి రైలు పెట్టెలో పర్యటించాడు. ఆ తర్వాత అనేక సభలలో పాల్గొని ప్రసంగించాడు. భారతీయులకు జరుగుతున్న అన్యాయాలను చాటి చెప్పే సంస్థగా భారత జాతీయ కాంగ్రెసు ఉండేది.




గాంధీ ప్రసంగాలు ప్రజల భావాలను కదల్చివేసినవి. కాంగ్రెసు మహాసభకు విచ్చేసిన నాయకులు, దేశప్రజలు, గాంధీని గొప్పగా మెచ్చుకున్నారు. గాంధీని తమ ప్రియతమ నాయకునిగా ఎంచుకున్నారు. ఎవ్వరూ కూడ విదేశీపాలనతో సహకరించవద్దని దేశ ప్రజలకు గాంధీ పిలుపిచ్చాడు. 1. భారతీయులు ఆంగ్ల ప్రభుత్వ ఉద్యోగాలు వదలాలని, 2. న్యాయవాదులు కోర్టులను బహిష్కరించాలని, 3. విద్యార్థులు ఆంగ్ల కళాశాలలను బహిష్కరించాలని పిలుపిచ్చాడు. దీనినే "సహాయ నిరాకరణోద్యమం" మరియు "త్రివిధ బహిష్కారం'' అంటారు. ఈ ఉద్యమం 1920-22లో జరిగింది.

లక్షలాది మంది ప్రజలు ప్రభుత్వానికి తమ సహకారం మానుకున్నారు. తమంతట తామే దేశ స్వాతంత్ర్యానికై పోరాడడానికి సిద్ధమైనారు. 1920 లో గాంధీ ఆధ్యక్షుడిగా జాతీయ కాంగ్రెసు మహాసభ బెజవాడలో (ఇప్పటి విజయవాడ) జరిగింది. ఇక్కడే జాతీయజెండా రూపొందింది. రూపశిల్పి ఎవరో కాదు, మన తెలుగు వాడైన పింగళి వెంకయ్య!



గాంధీ కీర్తి భారతదేశ మంతటా వ్యాపించింది. అప్పటి నుండి ఆయనను మోహన్‌దాస్ గాంధీ అనుటకు బదులుగా 'గాంధీజీ' అని, 'బాపూజీ' అని పిలువ నారంభించారు. 'బాపు' అంటే గుజరాతీలో తండ్రి అని అర్థం.

విదేశీ పాలన వలన గ్రామ పరిశ్రమలు నశించాయి. వానిలో నూలు వడుకుట, చేనేత చాలా ముఖ్యమైనవి. ఈ కుటీర పరిశ్రమలను పునరుద్ధరించవలెనని గాంధీ నిశ్చయించాడు. గ్రామ గ్రామాన పర్యటించాడు. ప్రతి ఒక్కరినీ రాట్నముపై దారము తీయమని కోరాడు. ఆ విధంగా చేతితో దారం వడికి, మగ్గంపై నేసిన బట్టలను "ఖద్దరు, లేదా ఖాదీ" అంటారు. అట్టి ఖాదీని తయారుచేసి, ధరించమన్నాడు. లక్షలాది గ్రామాల్లో చరఖా చక్రాలు తిరిగాయి. మగ్గాలు ఆడాయి. పేదలకు ఉపాధి దొరికింది. ఇంగ్లాండు నుండి వచ్చే విదేశీమిల్లు వస్త్రాలకు వ్యాపారం పడిపోయింది.



భారతదేశం పేదరికంలో మ్రగ్గుతోందని గాంధీ గ్రహించాడు. తనూ వారివలె పేదవానిగా జీవించటం మొదలు పెట్టాడు. ఆయన చొక్కా తొడగడం మానివేశాడు. అంగవస్త్రమే ధరించడం మొదలు పెట్టాడు. సబర్మతీనది ఒడ్డున "సత్యాగ్రహ ఆశ్రమం" నిర్మించుకుని, 23 మంది సహచరులతో నిరాడంబర జీవితం గడిపాడు. 1930 నాటికి సహచరులు 78కి పెరిగారు.

ప్రజలు ఆయనను "మహాత్ముడ"ని గౌరవించారు. ఆయన ప్రజలను సమీకరించాడు. విదేశ పాలనకు వ్యతిరేకంగా ప్రచారం చేశాడు. తుపాకులు ఎక్కుపెట్టి, ప్రజలను ఎన్నోహింసలకు గురిచేసే ఆంగ్లపాలకుల దమనకాండకు వ్యతిరేకంగా, అహింసాత్మక ఉద్యమాలను ఆయన నడిపాడు. ఎన్నోసార్లు ఆయనను, అనుచరులను, ప్రజలను, బ్రిటీష్ వారు జైలులో వేశారు. ఎన్నో బాధలు పెట్టారు. ఇలా కోట్లాది జాతి జనులను ఏకం చేసి, స్వరాజ్య సమరాన్ని సాగించాడు గనుకనే ఆయన్ని 'జాతిపిత' (Father of the Nation) అన్నారు.




1930లో గాంధీ ఉప్పు మీద విధించబడిన పన్నును వ్యతిరేకిస్తూ 'దండి' సత్యాగ్రహం చేశాడు. ఆంగ్ల ప్రభుత్వ శాసనాలను ఉల్లంఘించమని పిలుపిచ్చాడు. గాంధీ చేస్తున్న ప్రచారం, ఉద్యమం బ్రిటిషువారికి గిట్టలేదు. వారు దానిని అణచడానికి ప్రయత్నించారు. కానీ, విఫలం చెందారు. అప్పుడు వారు రాజీ చర్చలకు ఆయనను ఇంగ్లాండుకు ఆహ్వానించారు. దానినే రౌండ్ టేబుల్ సమావేశం అంటారు. అక్కడ కూడా ఆయన దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కోరాడు. అంతకు తక్కువకు ఆయన ఏ మాత్రం అంగీకరించలేదు.

ఇంగ్లాండు రాజైన అయిదవ జార్జి గాంధీని తన రాజభవనానికి ఆహ్వానించాడు. బ్రిటన్ ప్రధాని చర్చిల్ గాంధీని "అర్ధ దిగంబర సన్యాసి" (Half naked Fakir) అని పరిహసించాడు. అయితేనేం? గాంధీ నిరాడంబరంగా తన మామూలు ధోవతితోనే ఆయనను కలిశాడు. 'భావనాబలం, కార్యశూరత' కలవానికి దుస్తుల విలువ ఏమీ ఉండదు కదా!



ఇంగ్లాండులో దేశ స్వాతంత్ర్యానికై ఆయన జరిపిన మంతనాలు విఫలమైనాయి. ప్రజల బలము, బాధా సహనముల వల్లనే స్వాతంత్ర్యము సమకూరుతుందని స్పష్టమయింది. ఆయన అందుకని ప్రజలను కూడగట్టి ''క్విట్ యిండియా'' ఉద్యమాన్ని ఆరంభించాడు. అంటే 'ఆంగ్లేయులారా, మీరు మా దేశాన్ని వదలి వెళ్ళిపోండి' అని హెచ్చరించడం. ఇది 1942 ఆగస్టులో ఉధృతంగా జరిగింది. బ్రిటీష్ సామ్రాజ్య పునాదులు కదిలిపోయాయి.

దీంతో, బ్రిటిషువారికి గాంధీపై ఇతర ఉద్యమకారులపై తీవ్రమైన ఆగ్రహం కలిగింది. ఆయనను, ఆయన అనుచరులను పూనాలోని "ఆగాఖాన్ పాలెస్"లో ఖైదు చేశారు. ఆయనతో బాటు జైలులో వున్న ఆయన ముఖ్య కార్యదర్శి మహదేవ్ దేశాయి 15-8-1942న, భార్య కస్తూర్బా 22-2-1944 న అక్కడనే అనారోగ్యంతో మరణించారు.



అయినా, ఏదీ కూడ మహాత్ముణ్ణి ఆయన అనుచరులనూ కృంగదీయలేకపోయింది. గత్యంతరం లేక బ్రిటిష్‌వారు వారిని విడుదల చేశారు. మన దేశానికి స్వాతంత్ర్యం యిచ్చారు. వారు మర్యాదగా దేశాన్ని వదలి వెళ్ళిపోయారు. 1947 ఆగస్టు 15న ఢిల్లీలోని ఎర్రకోటపై మన జాతీయ జెండా ఎగిరింది. గాంధీతోపాటు నేతాజీ సుభాష్‌చంద్రబోస్, జవహర్‌లాల్ నెహ్రూ, సరోజినీ నాయుడు, ప్రకాశం పంతులు మొదలగు ఎందరో నాయకులు, భగత్‌సింగ్, అల్లూరి సీతారామరాజు లాంటి విప్లవ వీరులు, లక్షలాది సాధారణ పౌరులు చేసిన త్యాగాలు - బలిదానాల వల్ల ఆ స్వాతంత్ర్యం మనకు వచ్చింది.

ఇలా 190 సం॥ల (1757-1947) తర్వాత మనదేశం ఆంగ్ల బానిసత్వం నుండి విముక్తి పొందింది. ప్రతిచోటా ప్రజలు చాలా సంతోషంతో ఆ రోజు ఉత్సవం చేసుకున్నారు. మన స్వాతంత్ర్యం ఎల్లకాలం వర్ధిల్లుగాక!



ఆ విధంగా స్వతంత్రం సంపాదించిన దేశాన్ని పాలించడానికి అర్హులెవరు? మహాత్ముడూ, ఆయన అనుచరులు కదూ! కాని మహాత్ముడు ఏ పదవికీ యిష్టపడలేదు. అసలు స్వతంత్రం వచ్చిన తీరే ఆయనకు నచ్చలేదు. ఆంగ్లపాలకుల కుట్ర కారణంగా భారతదేశం ఇండియా, పాకిస్తాన్‌లుగా విడిపోయి రెండు ముక్కలు కావడం, హిందువులు ముస్లింలు ఒకరినొకరు చంపుకోవడం ఆయన్ని తీవ్రంగా బాధించింది.

ఎలాగైనా పరిపాలన సాగాలె కదా మరి! గాంధీతో కలసి దేశం కొరకు బాధలు పడిన జవహర్‌లాల్ నెహ్రూ ప్రధానమంత్రిగా, సర్దార్ వల్లభాయి పటేల్ ఉపప్రధానిగా, రాజగోపాలాచారి ఆఖరి గవర్నర్ జనరల్‌గా, బాబూ రాజేంద్రప్రసాద్ దేశ ప్రథమ రాష్ట్రపతిగా, మౌలానా అబుల్ కలాం అజాద్ ప్రథమ విద్యాశాఖామంత్రిగా స్వతంత్ర భారత పరిపాలన ప్రారంభమైంది.



మహాత్ముడు ప్రతి సాయంత్రం ప్రార్థనా సమావేశం జరిపేవాడు. ప్రజలు కుల, మత, వర్గ, భాషా భేదాలు లేకుండా, అందరూ కలసి ఆ సమావేశాల్లో పాల్గొనేవారు.

1948 జనవరి 30న మన దేశరాజధాని ఢిల్లీలో అటువంటి ఒక ప్రార్థనా సమావేశంలో గోడ్సే అనే తీవ్రవాది ఆయనను పిస్తోలుతో కాల్చాడు. మహాత్ముడు అక్కడే "హే రాం" అంటూ మరణించాడు. హిందువులు, ముస్లింలు అన్నదమ్ముల వలె కలసిమెలసి శాంతిగా జీవించాలని, కలహించుకోవద్దని ఆయన ప్రచారం చేయడం కూడా గిట్టని మతోన్మాదులే ఆయన్ని అలా చంపారు. మనం స్వేచ్ఛాజీవులుగా బ్రతకడానికి తన జీవితాన్ని ధారపోసిన ఆ అహింసామూర్తి చూపిన మార్గంలో మనం నడుద్దాం. సత్యం, ధర్మం, అహింస, కరుణ, ప్రేమ, శాంతి, మతసహనం మొ॥ ఉన్నత నైతిక విలువలను పాటించుదాం!

పుస్తకం ముగించేసరికి గోపాల్ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.



మా ప్రచురణలు, మావద్ద లభించు గాంధీ, బుద్ధ సాహిత్యం

జాతిపిత గాంధీ 52 పేజీలు 20 రూ.

బుద్ధుని అడుగు జాడలలో గాంధీ 52 పేజీలు 20 రూ.

మహాత్మాగాంధీ జీవితం - సందేశం 32 పేజీలు 20 రూ.

జాతీయోద్యమ కవితా సుమమాల 28 పేజీలు డెమ్మీ : 15 రూ.

ఆత్మకథ (లేక) సత్యశోధన (నవజీవన్ ప్రచురణ) 420 పేజీలు : 100 రూ.

గాంధీజీ జీవిత విశేషాలు - అమరావతి పబ్లిషర్స్ 110 పేజీలు క్రౌన్ : 110 రూ.

మద్యనిషేధం - గాంధీజీ : 5 రూ. గాంధీ క్విజ్ (300 ప్రశ్నలు-జవాబులు) : 10 రూ.

మానవాళికి మార్గదాత గౌతమ బుద్ధుడు. సవేర. 50 పేజీలు : 25 రూ.

(పై పుస్తకములలో పరీక్షలు జరిపి, విజేతలకు ప్రశంసా పత్రము లివ్వబడును)

మీడియాకు ముకుతాడు.. (అశ్లీలతను అరికట్టే చట్టాలు - నిబంధనల సంకలనం) 32 పేజీలు 20 రూ.

సమరం పై యుద్ధం (రోతరాతలపై విమర్శల వెల్లువ) 120 పేజీలు 50 రూ.


'నైతిక విప్లవం' ద్వైమాస పత్రిక (1987 నుండి 2006 వరకు ప్రచురణ)

• వివరాలకు •

ఈదర గోపీచంద్, వ్యవస్థాపకులు : గాంధీ స్మారక సమితి (రిజి. 159/85)

గాంధీవనం, ఇక్కుర్రు రోడ్, నరసరావుపేట - 522 601. గుంటూరు జిల్లా. సెల్: 94403 45494.

JATIPITHA GANDHI (TELUGU) Rs.20/-



ఆ కాలమ్మున గౌతము
డీ కాలమునందు గాంధి యిద్దరు హింసా
వ్యాకుల జగతికి శాంతి
శ్రీకరులు దయా విధేయ జీవన నిరతుల్ !

– తుమ్మల సీతారామమూర్తి

150 YEARS OF CELEBRATING THE MAHATMA

గాంధీజీ 150వ జయంతి

సంవత్సర (2018-19) స్ఫూర్తితో

"జాతిపిత గాంధీ" పుస్తక అధ్యయనానికి పూనుకున్న
బాలబాలికలకు ఆశీస్సులు.
ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, పాఠశాలలకు
ఇవే మా అభినందనలు.



డా. కారసాని శ్రీనివాసరెడ్డి
MD.,DM,DNB కార్డియాలజిస్ట్